సాక్షి జగిత్యాల

మంగళవారం ; 6 ; ఫిబ్రవరి ; 2024



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో సోమవారం రద్దీ నెలకొంది. వేలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దారిలో..

సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం, రాత్రివేళ చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

గ్రామాలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: గ్రామాలను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం ప్రత్యేకాధికారులకు శిక్షణ కల్పించారు. ఈనెల 7 నుంచి 15 వరకు స్పెషల్ డ్రైవ్ ఉందని, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, విద్యుత్ బకాయిల చెల్లింపులతోపాటు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపులు, ట్రాక్టర్ల బ్యాంక్ వాయిదాల చెల్లింపులపై దృష్టి సారించాలని, సకాలంలో పన్నులు వసూలు చేయాలని పేర్కొన్నారు. ఉపాధి కింద చేపట్టే పనులను మార్చి 31వరకు పూర్తి చేయాలన్నా రు. నర్సరీల్లో మొక్కల పెంపకం, వైకుంఠదా మాలు, సెగ్రిగేషన్ షెడ్లు, విద్యుత్‌దీపాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతినెల గ్రామసభలు నిర్వహించాలన్నారు. అంతకు ముందు అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరేశ్ పాల్గొన్నారు.

అసంతృప్తి కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమావేశం



సమావేశమైన ఎమ్మెల్యే సంజయ్

రాయికల్: రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిపై గత నెల 29న కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, శ్రీరాముల సువర్ణ, వడ్లకొండ మహేశ్‌గౌడ్, అన్వరిబేగం, అనుమల్ల దివ్య, మారంపల్లి సాయికుమార్, కన్నక మహేందర్ అవిశ్వాసం పెట్టిన విషయం తెలిసిందే. తీర్మానపత్రాన్ని కలెక్టర్‌కు ఇచ్చి శిబిరానికి వెళ్లారు. రెండోరోజుకే శిబిరం నుంచి సాయికుమార్, మహేందర్ వచ్చి చైర్మన్‌ను కలిశారు. క్యాంప్‌లోనే ఉన్న అనిల్, కాంతారావు, హుస్సేన్, శ్రీరాముల సత్యనారాయణ, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌తో సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో కలిశారు. కౌన్సిలర్ల సమస్యలు, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమావేశం కావడం చర్చనీయాంశమైంది.

పెగడపల్లి రాజన్న హుండీ ఆదాయం రూ.1.15లక్షలు



పెగడపల్లి: పెగడపల్లి రాజన్న హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. భక్తుల ద్వారా రూ.1.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఉపాధ్యక్షుడు మల్లేశం, సభ్యులు నర్సింహారెడ్డి, పార్థసారథి, వెంకట్‌రెడ్డి, కిషన్‌రావు, తిరుపతి, శివస్వాములు రమేశ్, అరవింద్, లక్ష్మణ్, పోచమల్లు పాల్గొన్నారు.

బీర్పూర్ నృసింహుడి జాతర వేలం వాయిదా

సారంగాపూర్: బీర్పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి జాతర వేలం వాయిదా పడింది. ఈనెల 19 నుంచి మార్చి రెండో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా లడ్డూ, పులిహోర, కొబ్బరిచిప్పల సేకరణ, పట్టెనామాలు, కోరమీసాలు, తలనీలాల సేకరణకు సోమవారం బహిరంగా వేలం వేశారు. అయితే గత బ్రహ్మోత్సవాల కంటే తక్కువ ధరలు రావడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

చివరి భూములకు చేరని నీరు

సారంగాపూర్: ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదలైనా మండలంలోని బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాల్లోని పొలాలకు పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. డీ–53, 12ఎల్, 1ఆర్ కాలువల ద్వారా మూడు గ్రామాలకు నీరు అందాల్సి ఉంది. కాలువల్లో పూడికచేరడం.. నీటి ప్రవాహాన్ని పెంచకపోవడంతో చివరివరకు చేరలేదు. నాట్లు వేసుకునే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు తడులు అందించామని అధికారులు చెబుతున్నా తమ పొలాలకు మాత్రం ఒక్కతడి కూడా అందలేదని రైతులు అంటున్నారు. కొందరు రైతులు పోసానుకుంట నుంచి బట్టపల్లిలోని పొలాలకు నీరు చేరా లనే ఉద్దేశంతో పొక్లెయిన్ సహాయంతో 1ఆర్ఆర్ కాలువను శుభ్రం చేయిస్తున్నారు. ఆ పనులను నీటిపారుదల శాఖ డీఈ చక్రూనాయక్ పరిశీలించారు. నీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అద్దె పెంచరు.. లీజు వదలరు

- జగిత్యాల బల్దియాలో బినామీల ఇష్టారాజ్యం
- షాపింగ్ కాంప్లెక్స్‌లకు టెండర్లు కరువు
- ఏళ్లు గడుస్తున్నా నిర్వాహకులు పాతవారే..
- టెండర్లు నిర్వహిస్తే మున్సిపల్‌కు ఆదాయం



జగిత్యాల మున్సిపల్ కాంప్లెక్స్

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో బినామీల దందా నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు షాపింగ్ కాంప్లెక్స్‌లకు టెండర్లు నిర్వహించగా.. అప్పుడు దుకాణాలు దక్కించుకున్నవారే ఇంకా కొనసాగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాత వారే బినామీలుగా ఉంటూ ఇతరులకు అద్దెకిస్తున్నారు. సుమారు 15ఏళ్ల క్రితం నిర్వహించిన టెండర్లను ఇప్పటివరకు తిరిగి మళ్లీ నిర్వహించలేదు. వాస్తవానికి నిబంధనల ప్రకారం మూడేళ్లకోసారి టెండర్లు నిర్వహించాల్సి ఉంటుందని బల్దియా అధికారులు చెబుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంగా మారడంతో షాపింగ్ కాంప్లెక్స్ గదులకు టెండర్లు నిర్వహిస్తే బల్దియాకు మరింత ఆదాయం అద్దె రూపంలో లభించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

జిల్లాకేంద్రంతో పెరిగిన మార్కెట్ ధర

జగిత్యాల జిల్లా కేంద్రంగా అవతరించడంతో ప్రజల తాకిడి పెరిగింది. వాణిజ్య వ్యాపారాలు కూడా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కార్పొరేట్ స్థాయికి ధీటుగా షాపింగ్‌మాల్స్, దుకాణాలు వెలుస్తున్నాయి. అదే సమయంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు డిమాండ్ పెరిగింది. ప్రైవేటు కాంప్లెక్స్‌లకు అద్దె అత్యధికంగా ఉండగా.. మున్సిపల్ కాంప్లెక్స్‌ల అద్దె గతంలో నిర్ణయించిందే ఇంకా కొనసాగుతోంది. ప్రతి మూడేళ్లకోసారి టెండర్లు నిర్వహించి అద్దె పెంచుకునే అవకాశాన్ని బల్దియా అధికారులు, పాలకవర్గం సద్వినియోగం చేసుకోవడం లేదని ఆరోపణలున్నాయి. మూడేళ్లకోసారి దుకాణాల టెండర్లు నిర్వహించాల్సి ఉండగా.. ప్రస్తుతం అద్దె 33.33 శాతం పెంచుతూ ప్రస్తుతం ఉన్నవారినే కొనసాగిస్తున్నారు. కానీ టెండర్లు వేస్తే బల్దియాకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో ప్రైవేటు కాంప్లెక్స్‌లకు, మున్సిపల్ కాంప్లెక్స్‌లకు అద్దె విషయంలో చాలా వ్యత్యాసం ఉంది.

జిల్లాలో 198 దుకాణాలు

జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్, అంగడిబజార్, పార్క్ సంది, ఎంపీడీవో ఆఫీస్ ఎదురుగా, పాతబస్టాండ్ సమీపంలో మొత్తం 198 దుకాణాలు ఉన్నాయి. ఇందులో ఒకటిరెండు మినహా మొత్తం అద్దెకే నడుస్తున్నాయి. అయితే సుమారు 15 ఏళ్ల క్రితం నిర్వహించిన టెండర్ల ద్వారా అప్పుడే మున్సిపల్‌కు రూ.10 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం వాటిని మళ్లీ వేలం వేస్తే అత్యధికంగా వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రైవేటు కాంప్లెక్స్‌లో నెలకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల అద్దె ఉంటోంది. మున్సిపల్ కాంప్లెక్స్‌లో మాత్రం అప్పటి అద్దెకు 33.33 శాతం పెంచుతూ పోతున్నారు. అంతేకానీ టెండర్లు మాత్రం నిర్వహించడం లేదు.

అందరూ బినామీలే

డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు టెండర్ల ద్వారా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల సముదాయం పొంది వాటిని అద్దెకిస్తున్నారు. అప్పుడు టెండర్ పొందిన యజమానులు ప్రతిఏటా 33.33 శాతం మున్సిపల్‌కు అద్దె చెల్లిస్తూ వారే కొనసాగుతున్నారు. అయితే నిబంధనల ప్రకారం ఎవరైతే టెండర్ పొందారో వారే షాపులు నిర్వహించుకోవాలి. కానీ వీరు ఇతరులకు అద్దెకిస్తూ ఎక్కువ మొత్తంలో అద్దె పొందుతున్నారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ టెండర్లు పొందిన అభ్యర్థే అందులో షాప్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఒకరిద్దరు మినహా ప్రతిషాపును వేరేవారే కొనసాగిస్తున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

పెరిగిన అద్దె ధరలు

వాస్తవంగా జిల్లాకేంద్రంలో అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కో షాపునకు దాదాపు అద్దె రూ.15వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. కానీ మున్సిపల్ షాపులకు మాత్రం రూ.10నుంచి రూ.15 వేల వరకు మాత్రమే అద్దె లభిస్తోంది. గతంలో టెండర్లు పొందినవారే కొనసాగుతుండడంతో బల్దియా ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ కాంప్లెక్స్‌లకు టెండర్లు నిర్వహిస్తే బల్దియాకు అత్యధిక ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం



ప్రస్తుత మార్చితో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఆ తర్వాత చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ కాంప్లెక్స్‌లకు సంబంధించిన కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. టెండర్ పొందినవారే షాపు నిర్వహించుకోవాలి. బినామీలకు ఇవ్వకూడదు.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

ప్రజావాణికి సమస్యల ఏకరువు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

- అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలన్న కలెక్టర్
- బాధితుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల: ప్రజావాణికి వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. గృహలక్ష్మి, భూ సమస్యలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు, పెన్షన్లకు సంబంధించి 46 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకుంటారని, వాటిని అధికారులు వెంటవెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు ఐదు విడతల్లో 90 దరఖాస్తులు రాగా.. 58 దరఖాస్తులకు అధికారులు జవాబు ఇచ్చారని, మిగిలినవి పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా అర్జీలకు సంబంధించిన వివరణలు పంపుతూ కలెక్టరేట్‌కు కూడా ప్రతిని పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులపై తీవ్ర ఆగ్రహం

అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లడంతో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రావు ప్రజావాణిని ప్రారంభించారు. కొందరు జిల్లాస్థాయి అధికారులు తమ కిందిస్థాయి సిబ్బందిని ప్రజావాణికి పంపించారు. అయితే కలెక్టర్ యాస్మిన్ బాషా మధ్యాహ్నం సమయంలోనే తిరిగి ప్రజావాణికి చేరుకున్నారు. ఆ సమయంలో జిల్లా అధికారులు లేకపోవడాన్ని గమనించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు రాకుండా ద్వితీయ శ్రేణి అధికారులను పంపడమేంటని, వెంటనే మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఇకనుంచి జిల్లా అధికారులే తప్పనిసరిగా హాజరుకావాలని, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

జగిత్యాల మామిడిని బ్రాండెడ్‌గా గుర్తించాలి

- ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా ప్రోత్సహించాలి

జిల్లాలో పండిస్తున్న మామిడిని బ్రాండెడ్‌గా గుర్తించేలా.. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మామిడి, పసుపు, నువ్వుల పంట సాగు ఎక్కువగా ఉన్నందున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. మామిడి రైతులకు అవగాహన కల్పించి బ్రాండెడ్ మామిడిని ఇతరప్రాంతాలకు ఎగుమతి చేసేలా చూడాలని పేర్కొన్నారు. రైతులకు అదనపు ఆదాయమార్గాల కింద కూరగాయల సాగు ప్రోత్సహించాలన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా వేయాలని, ప్రతిచోటా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్డీఏ పీడీ నరేశ్, హన్మంతరావు పాల్గొన్నారు.

వైన్స్‌షాపు తొలగించాలి



జిల్లా కేంద్రంలోని 20వ వార్డు బైపాస్‌రోడ్‌లో వైన్స్ షాప్ పెట్టారు. ఆ షాపుతో ప్రజలకు ఇబ్బందిగా ఉంది. సమీపంలోనే పాఠశాలలున్నాయి. మహిళలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తారు. వెంటనే అక్కడి నుంచి మద్యం షాపును తొలగించేలా చూడాలి.

– 20వ వార్డు ప్రజలు, జగిత్యాల

జగిత్యాల నుంచి తిరుపతికి రైలు నడపాలి



జగిత్యాల నుంచి తిరుపతికి రైలు వేయాలి. జగిత్యాల చుట్టుపక్కల నుంచి తిరుపతికి వెళ్లాలంటే కరీంనగర్, వరంగల్‌కు వెళ్లాల్సి వస్తోంది. జగిత్యాలకు రైల్వేలైన్ ఉన్న నేపథ్యంలో జగిత్యాల నుంచే తిరుపతికి రైలు నడిపితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– ముఖేశ్, జగిత్యాల

గత పాలకుల నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



వెన్నుమట్లలో పనులు ప్రారంభిస్తున్న అడ్లూరి

గొల్లపల్లి: తలాపున గోదావరి ఉన్నా.. ఇక్కడి నుంచి నీటిని హరీశ్‌రావు, కేటీఆర్ సిద్దిపేటకు తరలించుకుపోయినా మంత్రిగా కొప్పుల ఈశ్వర్ పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రాంతానికి తాగు, సాగునీటి ఎద్దడి తీవ్రమైందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెన్నుమట్ల, అబ్బాపూర్, బొంకూర్, శ్రీరాములపల్లి గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఉపాధి హామీ కింద మంజూరైన పలు సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. వెన్నుమట్ల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. గొల్లపల్లిలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో రెండింటిని అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే రూ.500కు గ్యాస్ సిలిండర్, 200యూనిట్లకు ఉచిత విద్యుత్ అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ఈ ప్రాంత ప్రజల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని, మేడారం రిజర్వాయర్ కాళేశ్వరం లింక్–2 ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించే ఆలోచన కూడా చేయలేదన్నారు. తాను తాగు, సాగునీటి కోసం ఇటీవలే రూ.కోటి మంజూరు చేయించానని, పనులు వేగవంతం చేసి శాశ్వత పరిష్కారం చూపుతామని వివరించారు. ఎమ్మెల్యేగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి, మాజీ సర్పంచులు పురంశెట్టి వెంకటపద్మ, గంగాధర్, సత్యనారాయణ, నాయకులు బీమ సంతోష్, రమేశ్‌రెడ్డి, నేరెళ్ల దేవేందర్, ఎల్లాల రాంమోహన్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, నేరెళ్ల మహేశ్, ఎల్లాల లింగారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు కాశె గంగాధర్, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు మజ్జు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- చైర్మన్‌కు వ్యతిరేకంగా 9మంది..
- అనుకూలంగా చేతులెత్తిన నలుగురు



అవిశ్వాసానికి మద్దతు ప్రకటించిన డైరెక్టర్లు

కథలాపూర్: మండలంలోని సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చుక్క దేవరాజంపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని సోమవారం ఉదయం 11గంటలకు ఏర్పాటు చేశారు. సంఘంలో 13 మంది డైరెక్టర్లకు చైర్మన్‌కు వ్యతిరేకంగా 9మంది చేతులెత్తారు. అనుకూలంగా నలుగురు నిలిచారు. దీంతో దేవరాజంను చైర్మన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు సత్యనారాయణ ప్రకటించారు. వైస్‌చైర్మన్ బత్తుల నరేశ్‌కు తాత్కాలిక చైర్మన్ పదవి అప్పగించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కొత్త చైర్మన్ ఎన్నిక ఉంటుందని వివరించారు. డైరెక్టర్లు సకాలంలో హాజరు కావాలని నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు.

పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణ



ఫైరింగ్ చేస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లాకేంద్రంలోని ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో ఫైరింగ్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ కూడా ఫైరింగ్ చేశారు. ఎస్పీ అధికారులు, సిబ్బంది ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని, అన్నిరకాల ఆయుధాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబర్చిన వారిని ఎస్పీ అభినందించారు. శిక్షణలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకరరావు, భీంరావు, డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, రవీంద్రకుమార్, రంగారెడ్డి, సీఐలు నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, రిజర్వ్ ఆర్ఐలు జానిమియా, వేణు పాల్గొన్నారు.



ఫైరింగ్ శిక్షణను పరిశీలిస్తున్న ఎస్పీ

ఎంపీ బరిలో ఎమ్మెల్సీ !

- జీవన్‌రెడ్డి పోటీ చేసేందుకు సన్నాహాలు
- గ్రాడ్యుయేట్ ఎన్నికల తరహాలో విజయం కోసం యత్నం
- పార్లమెంటుకు పోటీ చేయాలంటూ అనుచరుల ఒత్తిడి
- ఇప్పటికే డజను మందికిపైగా ఆశావహుల దరఖాస్తు
- కరీంనగర్‌తో ఉన్న సంబంధాలు గెలిపిస్తాయంటున్న కార్యకర్తలు
- గతంలో ఎంపీగా రెండుసార్లు పోటీ, ఎమ్మెల్సీగా విజయం



జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ మంత్రి, సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి బరిలో నిలవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనువెంటనే లోక్‌సభ ఎన్నికలు జరుగనుండడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్ కనిపిస్తోంది. అదే జోష్‌లో పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కసరత్తును ముమ్మరం చేసింది. పార్లమెంట్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఔత్సాహిక అభ్యర్థులు తమ దరఖాస్తులను గాంధీభవన్‌లో సమర్పించాలని పార్టీ అధిష్టానం సూచించింది. ఈ నెల 3 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించడంతో కరీంనగర్ నుంచి ఇప్పటికే పది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో.. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయంతోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దివంగత మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనవడు మేన్నేని రోహిత్‌రావు, మరో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు కుమారుడు వెలిచాల రాజేందర్‌రావుతోపాటు మాజీ సీఎం కేసీఆర్ అన్నకూతురు రేగులపాటి రమ్యారావు, ఎన్ఆర్ఐ సింగిరెడ్డి సుమనారెడ్డి, పొల్సాని స్నేహ, ఉప్పు రవీందర్, రుద్ర సంతోష్‌లు గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించారు.

దరఖాస్తులు సమర్పించిన పది మంది

- కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించిన వారు పది మంది ఉన్నారు.
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానమైన హుస్నాబాద్‌ను ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వదిలేయడంతో ఎంపీ అభ్యర్థిత్వం తనకు ఖాయమని భావిస్తున్నట్లు సమాచారం.
- సహకార బ్యాంకు నేతగా, ఇఫ్కో డైరెక్టర్‌గా, మాజీ ఎమ్మెల్యేగా సౌమ్యుడిగా పేరొందిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తనదైన శైలిలో ఢిల్లీ స్థాయిలో పార్టీ టికెట్‌ను కైవసం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.
- మాజీ మంత్రి, సీనియర్ నేత ఎమ్మెస్సార్ మనువడు మేన్నేని రోహిత్‌రావు రెండున్నరేళ్లుగా కరీంనగర్ అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. తన తాత ఎమ్మెస్సార్‌కు ఉన్న సంబంధాలను ఢిల్లీ వరకు ఉపయోగించుకొని యువకుడినైన తనకు పార్టీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తూ పార్టీ అధిష్టానంపై టికెట్ కోసం ఒత్తిడి తెస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్‌కు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అనుకూలంగా ఉండడం, ఓర్పు, నేర్పు కాంగ్రెస్‌కు కలిస్తాందని, వివాదరహితుడిగా పేరొందిన సంతోష్‌కుమార్‌కు టికెట్ కేటాయించాలని ఆయన వర్గీయులు అధిష్టానానికి విన్నవిస్తున్నారు.
- మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, కేడీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతోపాటు క్షేత్రస్థాయిలో గుర్తింపు ఉంది. ప్రతిపక్షాల విమర్శలను చిత్తు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆవశ్యకతను వివరిస్తూ దూసుకెళ్లే మృత్యుంజయంకే పార్టీ ఎంపీ అభ్యర్థిత్వం ఇవ్వాలని కోరుతూ ఆయన వర్గీయులు గాంధీభవన్‌కు వెళ్లి దరఖాస్తు సమర్పించారు.
- మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు కుమారుడు రాజేందర్‌రావు దరఖాస్తు చేసుకున్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, తెలంగాణ ఫోరం చైర్మన్‌గా తన తండ్రి చేసిన కృషిని గుర్తించాలని కోరుతున్నారు. తాను 2009లో ప్రజారాజ్యం పార్టీ పక్షాన పోటీ చేశానని, జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన సంబంధాలు ఉన్నాయని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆర్థిక సాయంతోపాటు పనిచేసిన విధానాన్ని పరిశీలించాలని కోరుతున్నట్లు తెలిసింది.
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు సైతం కరీంనగర్ ఎంపీ టికెట్‌పై కన్నేసినట్లు తెలిసింది.
- మాజీ సీఎం కేసీఆర్ అన్న కూతురు రేగులపాటి రమ్యారావు సైతం మహిళా కోటలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని పార్టీ అధిష్టానానికి విన్నవించింది.
- ఎన్ఆర్ఐ సింగిరెడ్డి సుమనారెడ్డి, రుద్ర సంతోష్, పొల్సాని స్నేహ, ఉప్పు రవీందర్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకొని వారి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఏది ఏమైనా కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ గెలుపుతో ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లను మట్టి కరిపించేలా ఫలితం రాబట్టాలనే ఎత్తుగడలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

జీవన్‌రెడ్డి వైపే అధిష్టానం మొగ్గు

కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపీ నుంచి ఎంపీ బండి సంజయ్‌కుమార్ హేమాహేమీలు కావడంతో వారికి సమ ఉజ్జీ అయిన అభ్యర్థిగా జీవన్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉండడం, ఒకసారి మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగడమే కాకుండా గతంలో తెలంగాణ ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్‌తో రెండుసార్లు కరీంనగర్ పార్లమెంట్‌కు పోటీ చేసిన అనుభవాన్ని పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకుంటున్నట్లు వినికిడి. ఉద్యమ సమయంలో కేసీఆర్‌పై మొదటిసారి జీవన్‌రెడ్డి పోటీచేసి 2 లక్షల పైచిలుకు ఓట్లతో ఓటమి పొందడం, రెండోసారి పోటీ చేసి కేవలం 16 వేల ఓట్లతో ఓడిపోవడం వంటి విషయాలను కాంగ్రెస్ పార్టీ మెరిట్‌గా తీసుకొని బరిలో నిలపాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. లోక్‌సభ పరిధిలో బలమైన రెడ్డి సామాజికవర్గం ఉండడం బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటైన పోటీ ఇచ్చేది జీవన్‌రెడ్డియేనని నమ్ముతున్నట్లు సమాచారం. మరోపక్క జీవన్‌రెడ్డి కూడా పోటీకి ఉత్సాహంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవీకాలం కూడా త్వరలోనే పూర్తికానుండడంతో ఎంపీగా పోటీకి సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు వినికిడి. ఓ వైపు బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా సమావేశాలు పెడుతుంటే.. కాంగ్రెస్ పా ర్టీలో అభ్యర్థి ఎవరనేది కొలిక్కిరాలేదు. అధికార పా ర్టీ అభ్యర్థి తేల్చితే కాంగ్రెస్ పార్టీ విజయం నల్లేరుమీ ద నడకే అన్నట్లుగా అవుతుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయ క్రీడారత్న అవార్డుకు ఎంపిక



విజయకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న రాధాకృష్ణ

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లోని సప్తగిరికాలనీకి చెందిన పోతన విజయ జాతీయ క్రీడారత్న అవార్డుకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) ఆధ్వర్యంలో ఏటా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అవార్డు ప్రదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా క్రీడారంగంలో రాణించిన విజయను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ నెల 11న తిరుపతిలో జరిగే 7వ సౌత్ ఇండియా బహుజన రైటర్స్ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విజయకు సోమవారం ఆహ్వాన పత్రిక అందించారు.

ఇండో–నేపాల్ కరాటే పోటీల్లో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో గోజు రీజు కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇండో–నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఓ.వంశవర్ధన్(8వ తరగతి) అండర్–12 బాలుర విభాగం వెపన్‌లో బంగారు, కటాలో కాంస పతకం, బాలికల విభాగంలో ప్రణవిగౌతమ్ (3వ తరగతి) వెపన్‌లో రజతం, కటాలో కాంస్యం, సుదీక్ష (7వ తరగతి) కటాలో రజతం, కుమిటీలో రజత పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట రూ.1.70 లక్షలు స్వాహా

వీణవంక(హుజూరాబాద్): ఉద్యోగం పేరిట ఓ నిరుద్యోగిని నట్టేట ముంచిన ఘటన వీణవంక మండలంలోని ఘన్ముక్కులలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వద్లూరి రాజు ఫోన్‌కు గత నెల 6న అమిటల్ మార్కెటింగ్‌లో జాబ్ ఆఫర్ ఉందని, ముందుగా పెట్టుబడి పెట్టాలని మెస్సేజ్ వచ్చింది. ఇది నమ్మిన అతను రూ.1.70 లక్షలు అపరిచిత వ్యక్తికి పంపించాడు. ఆ తర్వాత జాబ్ రా కపోవడం, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఫోన్‌లో అపరిచిత వ్యక్తులు లింక్‌లు పంపిస్తే ఓపెన్ చేయొద్దని సూచించారు.







రాజన్న దారిలో..

వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతో వేములవాడ రాజన్న దర్శనానికి సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క–సారక్కలను దర్శించుకునే భక్తులు ముందుగా రాజన్నకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. దీంతో భక్తుల రద్దీ పెరిగిపోతుంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు ఆర్జిత సేవలు రద్దు చేశారు. తలనీలాలు, కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు భరోసా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు భరోసా కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని 145 బస్సుల్లో రెండు విడతల్లో సీసీ కెమెరాలను అమర్చి.. ప్రయాణికుల భద్రతకు భరోసానిచ్చిన ఎస్పీని అభినందించారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలు, విద్యార్థుల రక్షణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలోని ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు డిపో కార్యాలయానికి, జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానించినట్లు వివరించారు. మహాశివరాత్రి భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వేములవాడలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వేములవాడలో ఏయే ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనేదానిపై పరిశీలించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, డిపో మేనేజర్ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

విద్యానగర్(కరీంనగర్): మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతిమ కేన్సర్ ఇన్స్టిట్యూట్, చల్మెడ కేన్సర్ ఇన్స్టిట్యూట్ వారి సహకారంతో కరీంనగర్ టీటీడీ కల్యాణ మండపంలో కేన్సర్ నిర్ధారణ శిబిరం కొనసాగుతోంది. రెండో రోజు సోమవారం విశేష స్పందన లభించిందని వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరకట్న వేధింపులకు యువతి బలి

గంగాధర: అత్తింటి వారి అదనపు వరకట్న వేధింపులు భరించలేక హిమ్మత్‌నగర్ గ్రామంలో యు వతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పుల్ల అభిలాష్ వివరాల ప్రకారం.. రామడుగు మండలం దేశరాజుపల్లి గ్రామానికి చెందిన స్వప్నకు 2018 సంవత్సరంలో గంగాధర మండలంలోని ఏగుర్ల కుమార్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.8లక్షల నగదుతో పాటు 4 తులాల బంగారం వరకట్నం కింద అప్పగించారు. ఒక సంవత్సర కాలం నుంచి అదనంగా రూ.5లక్షలు తీసుకురావాలని, లేకుంటే ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేయించాలని భర్తతో పాటు అత్త వేధించింది. పుట్టింటి వారికి చెప్పడంతో పంచాయితీ నిర్వహించి ఖర్చుల కోసం రూ.2.30లక్షలు ముట్టజెప్పారు. కొద్ది రోజులకే మళ్లీ వేధింపులు మొదలుపెట్టారు. అత్తింటి వేధింపులతో గత నెల 29న ఇంట్లో పురుగుల మందు తాగింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. మృతురాలికి కూతురు, కుమారుడున్నారు. మృతురాలి తల్లి సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అదనపు కట్నం కోసం వేధించిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన అస్రాకౌసర్‌ను అదనపు కట్నం కోసం వేధించిన ఆమె భర్త, అత్తామామ, మరిది, ఆడబిడ్డలపై బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. అస్రా కౌసర్‌ను 2019లో కోరుట్లకు చెందిన మహ్మద్ అబ్దుల్ వాజిద్‌కిచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో రూ.3.50లక్షలు, ఆరుతులాల బంగారం, రూ.1.30 లక్షల విలువైన ఫర్నీచర్, సామగ్రి అప్పగించారు. అస్రాకౌసర్ నెలరోజులు భర్తతో కలిసి కోరుట్లలో నివాసం ఉంది. భర్త ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వెళ్లాడు. అప్పటినుంచి మరో రూ.3లక్షలు అదనంగా కట్నం తేవాలని ఆమె అత్త రహీఉన్నీసాబేగం, మామ అహ్మద్ అబ్దుల్ వాహిద్, మరిది మహ్మద్ అబ్దుల్ అలీం, ఆడబిడ్డలు అంజుమ్ సుల్తానా, నిస్సర్ సుల్తానా, వాజిద్ సుల్తానా నిత్యం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. వేధింపులు భరించలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలించిన ఇద్దరి రిమాండ్

బోయినపల్లి(చొప్పదండి): మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న కేసులో వేములవాడకు చెందిన జితేందర్, అతని డ్రైవర్ తిరుపతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోయినపల్లి ఎస్సై ఎల్.శ్రీకాంత్ సోమవారం తెలిపారు. రత్నంపేట పరిసరాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ట్రాక్టర్ యజమాని జితేందర్‌పై ఇప్పటికే 18 కేసులు, డ్రైవర్ తిరుపతిపై 5 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈక్రమంలో ఇసుక అక్రమ రవాణా నేరానికి అలవాటుపడ్డ ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా నిలవాలి

కరీంనగర్: ఏడేళ్లుగా వేతన సవరణలో జాప్యం వల్ల టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు ఆర్థిక ప్రయోజనాలకు దూరమయ్యారని ఎన్‌ఎంయూ రీజినల్ కార్యదర్శి జక్కం పుల్లయ్య పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసి, ఉద్యోగులకు అండగా నిలవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వారి డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్ సంస్థల కోసమే అమృత్ భారత్ రైల్వేస్టేషన్లు

- ఆలిండియా రైల్వే మెన్ ఫెడరేషన్ కోశాధికారి శంకర్‌రావు ధ్వజం
- హాజరైన ఐదు జిల్లాల మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు



శంకర్‌రావును సన్మానిస్తున్న రైల్వే ఉద్యోగులు

రామగుండం: రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఆర్‌ఎల్‌డీఏ) పేరిట వేలాది ఎకరాలు, రూ.కోట్లతో రైల్వేస్టేషన్లను అమృత్‌భారత్ రైల్వేస్టేషన్లుగా తీర్చిదిద్దుతున్న కేంద్రప్రభుత్వం.. వాటిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) కోశాధికారి, అనుబంధ దక్షిణ మధ్య రైల్వేమజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ శంకర్‌రావు ఆరోపించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆయన మజ్దూర్ యూనియన్ కార్యాలయం ప్రారంభించారు. ఏఐఆర్‌ఎఫ్ శతజయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కాజీపేట–కాగజ్‌నగర్–నిజామాబాద్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్ల నుంచి వందలాది మంది యూనియన్ నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పోరాటాల గడ్డగా పేరున్న రామగుండం నుంచి శతాబ్ది వేడుకలు ప్రారంభిస్తున్నామన్నారు. మీటరు గేజ్‌స్థాయి నుంచి ట్రిపుల్ లైన్ బ్రాడ్‌గేజ్ స్థాయి, ఎస్కలేటర్, వైఫై, షాపింగ్ మాల్స్ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతీరోజు 21వేల రైళ్లు, ప్రతీ ఐదు నిమిషాలకో రైలు రాకపోకలు సాగిస్తున్న స్థాయికి రైల్వే రంగం చేరినా.. ఉద్యోగుల సంఖ్య 15 లక్షల నుంచి పది లక్షలకు పడిపోవడం దురదృష్టకరమన్నారు. వీరిస్థానంలో కాంట్రాక్టు కార్మికులను భర్తీచేయడం శోచనీయమన్నారు. కోవిడ్ సమయంలో 3,800 మంది ఉద్యోగులు మృతి చెందినా.. కరోనా వారియర్స్‌గా గుర్తించకపోగా, పరిహారం కూడా చెల్లించలేదని ఆవేదన చెందారు. రామగుండం బ్రాంచి ప్రతినిధులు మెట్ట రామారావు, ఓవై స్వామి, వీరన్న, మోజెస్, ఆనంద్ రాథోడ్, అరవింద్, రజనీకాంత్, రవి, కేంద్ర ప్రతినిధులు ఖాజాబాబా, పిల్లలమర్రి రవీందర్, ఉదయ్‌భాస్కర్, కాల్వ శ్రీనివాస్, కర్ర యాదవరెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల టీచర్ల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): మైనార్టీ గురుకుల టీచర్ల సమస్యలపై యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ మైనార్టీ గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 317 జీవోను రద్దు చేసి, బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలన్నారు. కేర్ టేకర్లను నియమించి, టీచర్లపై ఒత్తిడి తగ్గించాలని, ప్రిన్సిపాళ్ల హౌస్ మాస్టర్స్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, గోల్కొండ శ్రీధర్, జావేద్, రాజమౌళి, జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్, భూమేశ్వర్, టీచర్లు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులను ఆదుకుంటాం

- జిల్లా బాలల పరిరక్షణాధికారి కవితాదేవి



వివరాలు సేకరిస్తున్న కవితాదేవి

రామడుగు(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లిలో తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని జిల్లా బాలల పరిరక్షణాధికారి కవితాదేవి అన్నారు. సోమవారం గ్రామానికి వెళ్లి, బాధితులతో మాట్లాడారు. తల్లిదండ్రులు దైవాల పర్శరాం, పావని మృతి వివరాలు తెలుసుకున్నారు. విద్య, ఆర్థికంగా బాలల పరిరక్షణ కార్యాలయం నుంచి అండగా నిలుస్తామని ఆ పిల్లలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బత్తిని ప్రేమలత, దైవాల విజయ, కుల సంఘం నాయకులు తిరుపతి, మల్లేశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న రుద్రంగి ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన సుద్దాల భూమయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో కొండగట్టులో ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేకుండా ఎక్కువ రోజులు తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం భూమయ్య కూతురు వచ్చి చూడగా తాళం పగులగొట్టి, తలుపులు తెరిచి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న రుద్రంగి ఎస్సై అశోక్ పోలీసు సిబ్బందితో వెళ్లి భూమయ్య కూతురు నుంచి వివరాలు సేకరించారు. కొండగట్టులో ఉంటున్న భూమయ్య వస్తే ఎం పోయాయి.. అనే విరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

టైరు పగిలి.. చెట్టును ఢీకొట్టిన కారు



టైరు పగిలి రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

చందుర్తి(వేములవాడ): ప్రమాదవశాత్తు కారు టైరు పగిలి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ముగ్గురు ప్రయాణికులతోపాటు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన చందుర్తి మండలం ఎన్గల్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. నిజామాబాద్ జిల్లా దర్పల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన వారు అద్దెకారులో వేములవాడ రాజన్న దర్శనానికి బయలుదేరారు. మార్గమధ్యలోని చందుర్తి మండలం ఎన్గల్ శివారుకు చేరుకునే సరికి కారు టైరు పగలడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ సంజీవ్‌తోపాటు ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

12న జిల్లాస్థాయి సైన్స్ డే పోటీలు

సప్తగిరికాలనీ(కరీంనగర్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12న జిల్లాస్థాయి సైన్స్ డే పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్దన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహించే ఈ పోటీల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. సుస్థిర అభివృద్ధికి సైన్స్ వినియోగం అనే అంశం పరిధిలో వ్యర్థాల తగ్గింపు, ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లు, ప్లాస్టిక్ నిషేధం, నీటి పరిరక్షణ, శక్తినిచ్చే వనరులను కాపాడటంపై చిత్రలేఖనం, కవితలు, పద్యాలు, పాటల, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొలుత 9వ తేదీలోగా పాఠశాల స్థాయిలో పోటీలు జరిపి, జిల్లాస్థాయి పోటీలకు హాజరు కావాలని సూచించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రదర్శనను ఈ నెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డిని 98494 65546 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గాయపడిన మహిళను పోలీస్ వాహనంలో తరలింపు



గాయపడిన మహిళను పోలీస్ వాహనంలో తరలిస్తున్న ఎస్సై

మల్యాల(చొప్పదండి): బైక్‌పై నుంచి కిందపడి గాయపడిన మహిళను పోలీసు వాహనంలో తరలించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు మల్యాల పోలీసులు. మండలంలోని గొల్లపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీ జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై బైక్‌పై వస్తోంది. సూర్య బీఈడీ కళాశాల వద్దకు రాగానే కిందపడింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న మల్యాల ఎస్సై తీగల అశోక్ గాయపడిన మహిళను పోలీస్ వాహనంలో మల్యాల ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు.

ప్రిన్సిపల్‌పై దాడిచేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్‌పై దాడిచేసి చంపుతానని బెదిరించిన జక్కుల సంతోష్, జక్కుల లక్ష్మీపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. ప్రిన్సిపల్ అశోక్ సోమవారం తన విధులు ముగించుకుని బయటకు వస్తుండగా సంతోష్, లక్ష్మీ అతని వాహనాన్ని అడ్డగించి చేతులతో కొట్టి అతడి విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, చంపుతానని బెదిరించారు. ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కళాశాలలో అటెండర్‌గా పనిచేసే జక్కుల లక్ష్మీ విధులకు సక్రమంగా రాకపోవడంతో గతనెల 31న ప్రిన్సిపల్ సరెండర్ చేశారు. ఆమెను ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల బదిలీ చేశారు. అయితే కళాశాల ప్రిన్సిపల్ అశోక్ తనకు వేతనం రాకుండా అడ్డుపడుతున్నారని జనవరి 31న కూడా జక్కుల సంతోష్ ప్రిన్సిపల్ విధులకు ఆటంకం కలిగించగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలిపై కత్తితో దాడి

- బంగారు నగలు అపహరణ



విచారణ చేపడుతున్న ఏఎస్పీ చంద్రయ్య తదితరులు

కోనరావుపేట(వేములవాడ): ఓ వృద్ధురాలిపై కత్తితో దాడికి ప్రయత్నించి బంగారు నగలు అపహరించుకుపోయిన సంఘటన కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలో సోమవారం జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలు. మంగళ్లపల్లిలో నంది సిద్దవ్వ అనే వృద్ధురాలు సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి గొంతుపై కత్తిపెట్టి, నోరు మూశారు. ఒంటిమీద ఉన్న మూడు తులాల కమ్మలు, పుస్తెలతాడును లాక్కెళ్లారు. సిద్దవ్వ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోగై వెతికినా దొంగల ఆచూకీ దొరకలేదు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని వృద్ధురాలు రోదిస్తూ తెలిపింది. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు గ్రామంలో విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు.

ఆయిల్‌స్టోర్‌లో అగ్నిప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని వేంపేట రోడ్డులోగల జేసీబీ ఆయిల్ స్టోర్ అండ్ స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం రోజువారిలాగే దుకాణాన్ని తీసిన యజమాని కొద్దిసేపటికి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి దుకాణంలో మంటలు అంటుకున్నాయి. ఆయిల్, ఇతర సామగ్రికి మంటలు వ్యాపించాయి. సంఘటనలో సుమారు రూ.8లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు లక్ష్మీనర్సయ్య తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికిగల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి



గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్లకు చెందిన కసుకంట్ల తుకారం (36) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన తుకారం గ్రామంలో తాపీమేస్త్రీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లో అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. ఆయనకు భార్య యేసుమణి, కొడుకు, కూతురు సంతానం. తుకారం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.